వినాయకుడ్ని చూస్తే నిజంగా జాలేస్తుంది. ఏడాదికోమాటు బస్సులవాళ్లూ, స్టూడెంట్లు, అచ్చు తప్పుల్ని తప్పించడం కోసం పత్రికల వాళ్ళు, దుకాణదారులు, మనీ లెండర్లు తల్చుకుంటే తల్చుకోవచ్చుగాక ఓ పెళ్ళాం సంసారం పిల్లలూ లేకుండా ఎంతకాలం?

ఏమదరూ తన కొడుకు బ్రహ్మచారిగా వుండడం యిష్టపడదు గదా;

ఓ పన్నెవడో రాలగొట్టాడు - గజాననం - యివన్నీ డిస్క్వాలిఫికేషన్లే - పెళ్ళికి. ప్రతి హార్మనీవాయించేపిల్లా "లంబోదర లకుమికర" అంటూంటే వింటూ తన మేరేజి పోస్టు పోనవుతూంటె పాపం వినాయకుడు కుడుములు తింటూ ఎలుకనెక్కి అమాయకుళ్ళా సంచరిస్తూ వుంటాడు.

సైకిలెక్కే వాడికే లేదుకదా రెస్పెక్టు ఎలుకనెక్కేవాడికి ఎందుకుంటుందీ? కనీసం స్కూటరయినా - ఫర్వాలేదు ఓ మోస్తరు.

వినాయకుని పెళ్ళికి అత్తార్ని స్కూటరడగమని మనమంతా సపోర్టిద్దాం.

# గేదె మనసులు

గేదెలు డామ్ కేర్ మాష్టర్లు. గేదె శుభ్రంగా నీటుగా అలంకరించుగున్న సినిమా స్టారులా ఆకర్షణీయంగా ఎలా వుంటుంది? ఆరీగ్రాణిలా వుండమన్నా వుండదు. గేదెల ఫిలాసఫీ అంతా బురద ఫిలాసఫీ. అవి బురదలో పడుకున్నపుడు ఒక్కొక్కటి అరడజను బాక్సాఫీసు హిట్లు తీసిన సినిమా ప్రొడ్యూసర్లలా నిర్లక్ష్యంగా చూస్తాయి మనకేసి, బురదకేసి ఆకర్షింపబడి మనలను బురదలోకి లాగాలన్నట్లుగా చూస్తాయి. గేదెలు కవిత్వం రాస్తే బురదను మెచ్చుకుంటూ రాసిన వాడికి సహస్రఘట బురదాభిషేకం చేస్తాయి.

గేదెలకు భావాలుండవని ఎవరంటారు? ఆలోచనలు కలగవా? కలిగితే కలగవచ్చు. బురదలో పడుకున్న గేదె హృదయం రకరకాల భావాలకు రహదారి. గేదెలుకూడా స్త్రీజాతే కనుక - నాటి స్త్రీ జాతిని మానవులలో చూడటం వలన కలిగే రకరకాల భావాలతో అవి మునిగి తేలవచ్చు. (గేదెలు బురదలో మునిగినట్లు....) అవి మనస్త్రీల కట్టు-బొట్టు వ్యవహారికాల్ని గూర్చి ఏమనుకుంటాయో వూహిస్తే నాకు పరమ ఆశ్చర్యంగా ఉంటుంది. ఆసుపత్రులకు వెళ్ళడం లేదు. డాక్టర్లు లేకుండా? నర్సులు లేకుండా కన్నతల్లి చేసేపని చేస్తాయి కొన్ని గేదెలు. గేదెకూడా కంటుంది, తింటుంది, పాలిస్తుంది.

స్వచ్ఛమైన కమ్మటి తీయని పాలు - అలాటి పాలుతాగి ఎలాటి మంచిపనులైనా చేయవచ్చు మనం, కాని అడ్డమైన ఛండాలపు పనులు చేయడం మానలేకుండావున్నాం మనలో మనం.

పిల్లల్తో రిక్షాలో వెనుక మొగుడు గారు రొప్పుతూ సైకిలు తొక్కుతుండగా – అప్పుడే బురదలోనుంచి లేచిన బురద రాణిలా వయ్యారంగా తోకాడించుకుంటూ రోడ్డుమీద హొయలు వొలకబోస్తూ అడ్డంగా నడిచిపోయే గేదె మనసులో మనల్ని చూస్తే ఏయే వూహలు చెలరేగుతాయో చెప్పలేను. అబ్బ; అవి ఊహకందనివి. మనుష్యులలో కుళ్ళు కుట్ర మరిసహించలేకే కాబోలు అవి అప్పుడప్పుడు కొమ్ములు విసుర్తూ వుంటాయి. మనమీద కొమ్ములు విసిరి బురద చిమ్మక పోతే మనకి గేదెల ఫిలాసఫీ ఎలా తెలిసేడుస్తుంది?

# విషయ సూచిక

'బనీను కి స్త్రీలింగం బాడీట –'

పద్యం బనీనులా దండాన వ్రేలాడుతుంటే గేయం బాడీలా గాలిలో ఎగుర్తూ వుంటుందిట. ఏదైనా విషయసూచిక చూస్తుంటే నాకు గృహరాక్షసి (ఇల్లాలు అనగా బెడ్‌రూం లైటు పడక గదికి కాంతిని ఇచ్చునది) రకరకాల బట్టలను ఉతికి ఆరవేసే దృశ్యం చప్పున స్ఫురణకు వస్తుంది.

సీరియల్ నవల దండాన ఆరేసిన చీరలా కనిపిస్తే వ్యాసం పిట్ట గోడమీద ఆరేసిన లుంగీలా ఎగుర్తుంది.

సరే "కార్టూన్ల" ను. అండర్ వేర్సుతో పోలిస్తే "జోకు"ల్ని చడ్డీలనవచ్చు.

"స్కెచ్" వల్లెవాటులా గుంటే "కథానికలు" పరికిణీలలా వుంటాయి.

"సంపాదకీయం" పంచెలా వుంటే "రాజకీయ వ్యాసం"తువ్వాలులాగుంటుంది.

ముఖచిత్రం ఎలా వుండాలి?

రవికలా ముచ్చటగా వుండాలి;

ఉప్మాకాళిదాసుకి ఇష్టంట –

నాకూ యిష్టమే:

కొత్తచీర ఆకర్షించినట్టు సీరియల్నవల ఆకర్షించాలి.

బాత్‌రూమ్‌లో వున్నా, పడకగదిలో వున్నా, కూర తరుగుతున్నా, కుంపటి వెలిగిస్తున్నా– ఇల్లాలి మనసు తరువాత చాప్టరుమీదే లగ్నం కావాలి. ఇవతల పోపు మాడినా ఫరవాలేదు. కుంపటికాలి పోతున్నా డామ్‌కేర్ – జోకుల్ని చదువుతూంటే – కార్టూన్లని చూస్తోంటే బాడీ బిగించక పోయినా, జాకెట్ పిన్ను పెట్టుకోకపోయినా, పవిట కాస్త పొడుగయినా. చోళీ తిరగేసి తొడుక్కున్నా, రిబ్బనును కాటుకలో ముంచేసినా ఫేస్ పవుడరనుకొని కాల్‌గేట్ టూత్ పవుడరు ముఖానికి పులుముకున్నా సవరం పైకి కనిపించేట్లు జడ అల్లుకున్నా క్షమించాలి.